# సామెతలు

మాటలమధ్యలో అక్కడక్కడ సామెతలు వాడితే దానికో ప్రత్యేకత వస్తుంది. అందరినీ ఆకట్టుకొనే విధంగా మాట్లాడే సంభాషణా చాతుర్యంకలవారు విరివిగా సామెతలు వాడడం గమనించండి. ఇవి లోకోక్తులు కావచ్చు, హితోక్తులు కావచ్చు, ఉపమానాలు కావచ్చు. కాలక్రమంలో ఇవి చెవిమరుగౌతున్నాయి (కనిపించకుండా పోతే కను మరుగు, వినిపించకుండా పొతే చెవిమరుగు!). 'చంద్రునికో నూలు పోగులా' నే విన్నవి కొన్ని, చదివినవి కొన్ని సామెతలను మీ ముందుకు తెచ్చే ప్రయత్నం చేస్తున్నాను. ఇక మీరు విన్నవి కూడా మాకందరికి పంచండి.

అత్తసొమ్ము అల్లుడు ధారబోసాడట.
సొమ్ము ఒకడిది సోకొకడిది.
ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికి నిచ్చెనవేసిందట.
ఇల్లు ఇర్కటం ఆలి మర్కటం.
అత్తమీది కోపం దుత్తమీద చూపటం.
పెనం మీదనుండి పొయ్యిలో పడడం.
తంతే బూరెల గంపలో పడడం.
కలిసొచ్చే కాలం వస్తే నడిచొచ్చే కొడుకు పుట్టాడట.
కాలం కలిసి రాకపోతే తాడే పామై కరుస్తుంది.
గంతకు తగ్గ బొంత.
ఏడ్చేవానికి ఎడమవైపు కుట్టేవానికి కుడిచేతివైపు ఉండకూడదు.
రోలొచ్చి మద్దెలతో మొరపెట్టుకొన్నట్లు.
చెవిటివానిముందు శం ఖము ఊదడం.
వడ్లగింజల్లో బియ్యపుగింజ.
తులసివనంలో గంజాయి మొక్క.
దొంగలు పడిన ఆరు నెలలకు కుక్క మొరిగినట్లు.
అంగట్లో అన్నీ వున్నాయి ... అల్లుడి నోట్లో శని వుంది.
తింటే ఆయాసం ... తినకపోతే నీరసం.
కుండబరువు గుండెకెక్కింది.
చదువకముందు కాకరకాయ, చదువుకున్నాక కీకరకాయ.
రామాయణమంతా విని రామునికి సీత ఏమవుతుందని అడిగినట్లు.
పిండికొద్దీ రొట్టె.
ఎంతచెట్టుకు అంతగాలి.
కడివెడు గుమ్మడి కాయైనా కత్తిపీటకు లోకువే.
కూసే గాడిద వచ్చి మేసే గాడిదని చెరపిందట.
అంతామావాళ్లేగాని ... అన్నానికి రమ్మనే వాళ్ళు లేరు.
అందితే సిగ ... అందకుంటే కాళ్ళు.
అగ్నిశేషము, ఋణశేషము, శత్రుశేషము, వ్రణశేషము ఉంచరాదు.
అడ కత్తెరలో పోకచెక్క.
పని చేతగాని వాడు పని ముట్లను నిందించునట్లు.
మొగుడు కొట్టినందుకు కాదు, తోడికోడలు నవ్విందని.
పిచ్చి కుదిరితే గాని పెళ్ళి గాదు, పెళ్ళి అయితే గాని పిచ్చి కుదరదు.
దుడ్డు కర్రా ఎవరి మాట వింటావే, అంటే ఎవరిచేతిలో వుంటే వారి మాట అన్నదట.

ఇవి మచ్చుకో కొన్ని మాత్రమే! వీటిని చదవడంతోటే సరిపెట్టుకోక, మీ సంభాషణల్లో ప్రయోగించి చూడండి ... అవి వినేవారికి శ్రవణానందాన్నిస్తాయి. జీలకర్ర బెల్లము వంటికి చలువ ... సామెతలు చెవులకు చలువ.